

రేపు మద్యం దుకాణాలు బంద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈనెల మూడో తేదీ రాత్రి తొమ్మిది గంటల నుంచి మద్యం విక్రయాలను నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల నాలుగో తేదీన డ్రై డేగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలతో పాటు బార్లు, బీర్ల ఫ్యాక్టరీ, కల్లు దుకాణాలు, క్యాంటీన్లు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదో తేదీ నుంచి యధావిధిగా మద్యం దుకాణాలు తెరుచుకుంటాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



కౌంటింగ్‌కు ఏర్పాట్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టానికి తెర లేవనుంది. మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టనున్న కౌంటింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు విడివిడిగా ఓట్లను లెక్కించేందుకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి తర్వాత ఇవిఎంల్లోని ఓట్లను కౌంటింగ్ చేస్తారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

- **రేపు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలు**
- **ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**
- **210 టేబుళ్లు ఏర్పాటు**
- **1996 మంది సిబ్బంది విధులు**
- **సిసి కెమెరాల నిఘాలో కౌంటింగ్**
- **ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి గత నెల 13వ తేదీన ఎన్నికలు నిర్వహించారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి మొత్తం 14,17,959 మంది ఓటు వేశారు. వీరిలో పురుషులు 6,86,120 మంది కాగా మహిళలు 7,31,822 మంది, ఇతరులు 17 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ అనంతరం పటిష్ట పోలీసు భద్రత మధ్య ఎచ్చెర్ల శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. మంగళవారం వీటిని కౌంటింగ్ హాళ్లకు చేర్చి ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎనిమిది గదులు, శ్రీకాకుళం ఎంపీ సెగ్మెంట్‌కు తొమ్మిది గదులు కేటాయించారు. ప్రతి రౌండ్‌లో ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లలో 14 పోలింగ్ బూత్‌ల చొప్పున ఓట్లను లెక్కిస్తారు. వీటికి అదనంగా పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు టేబుళ్లను ఏర్పాటు చేశారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు

కౌంటింగ్‌లో భాగంగా తొలుత పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత సర్వీసు ఓట్లను కౌంట్ చేస్తారు. జిల్లాలో 25,826 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. సర్వీస్ ఓట్ల లెక్క సోమవారం మధ్యాహ్నానికి తేలనుంది. ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 29 టేబుళ్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం 30 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

రౌండ్ల వారీగా లెక్కింపు


ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి కౌంటింగ్ రౌండ్లు ఉంటాయి. కనిష్టంగా 19, గరిష్టంగా 24 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఆమదావలసలో 19 రౌండ్లలో లెక్కించనున్నారు. అక్కడ్నుంచే తొలి ఫలితం వెలువడనుంది. మధ్యాహ్నం మూడు గంటల కల్లా తుది ఫలితం రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 24 రౌండ్లలో ఫలితం వస్తుందని, సాయంత్రం ఐదు గంటలకు తుది ఫలితం వెలువడవచ్చని భావిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించి ఇచ్ఛాపురం 22 రౌండ్లు, పలాస 21, శ్రీకాకుళం 20, ఎచ్చెర్ల 23, నరసన్నపేట 21 రౌండ్లలో కౌంటింగ్ చేపట్టనున్నారు. మొదటి రౌండ్‌కు 30 నిమిషాలు, ఆ తర్వాత రౌండ్లకు 20 నిమిషాలు చొప్పున సమయం పడుతుందని అధికారులు చెప్తున్నారు.

కౌంటింగ్‌కు 1,996 మంది నియామకం

కౌంటింగ్ కోసం 1,996 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో రిటర్నింగ్ అధికారులు తొమ్మిది మంది, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు 77 మంది, కౌంటింగ్ అసిస్టెంట్‌లు 582 మందిని నియమించారు. మైక్రో అబ్జర్వర్లు 397 మందిని, నాలుగో తరగతి ఉద్యోగులను 439 మందిని విధులకు వినియోగిస్తున్నారు. కౌంటింగ్ సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం నియమించిన ఎనిమిది మంది ప్రత్యేక అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతతో పాటు అదనంగా ఒక వలయంలో పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. భద్రత కోసం 1459 మంది పోలీసులను వినియోగిస్తున్నారు. వీరితో పాటు ఒక కంపెనీ సిఐఎస్ఎఫ్, ఎపిఎస్‌పి ఒక ప్లాటూన్ బెటాలియన్ అదనపు బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.



కొత్తూరులో కురుస్తున్న వర్షం


తొలకరి పలకరింత

జిల్లాలో పలుచోట్ల వర్షాలు

ప్రజాశక్తి - కవిటి, కొత్తూరు, టెక్కలి

తొలకరి వర్షాలు జిల్లాను పలకరించాయి. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన జిల్లా ప్రజలు వర్షపు జల్లులతో సేదతీరుతున్నారు. కొత్తూరులో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీవర్షం గంట పాటు కురిసింది. దీంతో రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. టెక్కలిలో ఈదురుగాలుల ధాటికి పూరీ నుంచి గుణుపూర్ వైపు వెళ్తున్న రైలు మార్గంలో చెట్టు కూలడంతో రైలు గేటు మధ్యలో సుమారు ఐదు నిమిషాల పాటు రైలు నిలిచింది. దీంతో గేటు ఇరువైపులా ఉన్న వాహనదారులు, ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ట్రాక్ మీద కూలిన చెట్టును తొలగించాక రైలు వెళ్లడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.

ఆమదాలవలస, సంతబొమ్మాళి, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, టెక్కలి, నందిగాం, పోలాకి, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, బూర్జ ఇతర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులు తగ్గాక సరఫరాను పునరుద్ధరించారు. రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కట్టె జనుము, జీలుగు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



టెక్కలి : రైలు నిలిచిపోవడంతో గేటు వద్ద నిలిచిన వాహనాలు

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలి

ఎండిఎం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి

ప్రజాశక్తి - కంచిలి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎండిఎం కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయకుండా పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకుల్లో ఎటువంటి మార్పులు లేవన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకుండా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న పరిస్థితి ఉందన్నారు. వంట సమయంలో ప్రమాదం సంభవిస్తే, కనీసం పట్టించుకునే నాథుడే లేరన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే పద్ధతి ఆపాలని డిమాండ్ చేశారు. స్కూల్‌లో మౌలిక సదుపాయాలైన మంచి నీరు, వంటషెడ్, వంటపాత్రలు తదితర సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు యూనియన్ ఆధ్వర్యాన అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ కొత్త ప్రభుత్వాలపై మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎండిఎం కార్మికులకు రూ.10 వేలు కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అనుకోని రీతిలో మృతి చెందితే వారి దహన సంస్కారాలకు మట్టి ఖర్చులు ఇవ్వాలన్నారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న వారికి వేతనం, సెలవులు, మెటర్నిటీ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలన్నారు. వీటితోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏడాదికి రెండు జతల యూనిఫారాలను ఇవ్వాలన్నారు. రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు పెట్టి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.కౌసల్య, జి.దమయంతి, జయలక్ష్మి, తులసి, నారాయణమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- **ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 112 ఇవిఎం టేబుళ్లు**
- **ఎంపీ సెగ్మెంట్‌కు 98 టేబుళ్లు ఏర్పాటు**
- **జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్**
- **కౌంటింగ్‌కు ఇబ్బందులు సృష్టిస్తే కేసులు**
- **ఎస్‌పి జి.ఆర్ రాధిక**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల నాలుగో తేదీన ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను ఎనిమిది గదుల్లో చేపట్టనున్నామని వెల్లడించారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లను తొమ్మిది గదుల్లో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. అసెంబ్లీ స్థానాలకు మొత్తం 112 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 29 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 98 ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 30 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపును రెండు వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి కౌంటింగ్ విధులకు కేటాయించామన్నారు. ఇవిఎంలను భద్రపరిచే గదులు, లెక్కింపు గదుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీడియోగ్రఫీ చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరాతో పాటు రెండు అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి తొలి ఫలితం, చివరగా పాతపట్నం ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. పోలింగ్ కోసం జిల్లాకు వచ్చిన ముగ్గురు పరిశీలకులతో పాటు అదనంగా మరో ఐదుగురు పరిశీలకులు జిల్లాకు వచ్చారని, ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీరు పర్యవేక్షించనున్నారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఫలితాలు వెల్లడయ్యే వరకు జనం గుమికూడడం, బాణసంచా కాల్చడాన్ని నిషేధించామని చెప్పారు.

కౌంటింగ్‌కు ఇబ్బంది సృష్టిస్తే కేసులు : ఎస్‌పి

కౌంటింగ్‌కు ఇబ్బంది కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి జి.ఆర్ రాధిక హెచ్చరించారు. కౌంటింగ్ ఏజెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించిన తర్వాత కౌంటింగ్ ముగిసే వరకు ఉండాలన్నారు. కేంద్రం నుంచి ఒకసారి వెళ్లిపోతే మళ్లీ లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాల వద్ద 288, జిల్లావ్యాప్తంగా 536 ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ ఫోర్స్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహణకు కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ల వారీగా మొత్తం 1459 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తు కోసం నియమించామని వివరించారు.

కౌంటింగ్ సాఫీగా సాగేందుకు ఒక కంపెనీ సిఐఎస్ఎఫ్, ఒక ఎపిఎస్‌పి బెటాలియన్ నుంచి అదనపు బలగాలు జిల్లాకు వచ్చాయన్నారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లకు బ్రీత్ అనలైజర్‌తో టెస్ట్ చేసి లోపలకు అనుమతిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 4,877 బైండోవర్ చేశామన్నారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో 71 పికెట్లు ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా ఉంచామని తెలిపారు. జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఏడు అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులతో పాటు అదనంగా మరో 16 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈనెల నాలుగో తేదీ నుంచి జూన్ ఐదో తేదీ వరకు కౌంటింగ్ కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా సెక్షన్ 144, సెక్షన్ 30 అమలు చేస్తున్నామని చెప్పారు. మద్యం అమ్మకాలపై ఈనెల నాలుగో తేదీన నిషేధం విధించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి ప్రేమకాజల్ పాల్గొన్నారు.

విహారంలో విషాదం

సముద్రంలో మునిగి ఐటిఐ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - నౌపడ

విహారయాత్రలో విషాదం అలుముకుంది. సముద్ర తీరంలో సరదాగా గడుపుదామని వచ్చిన వారికి చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులు, బంధువులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన సారవకోట మండలం మర్రిపాడుకు చెందిన జెన్ని ఉపేంద్ర (17) సముద్రంలో స్నానానికి దిగి ఆదివారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సారవకోట మండలం మర్రిపాడు నుంచి సుమారు 50 మంది సముద్ర తీరానికి విహారయాత్రకు వచ్చారు. అందులో నలుగురు మధ్యాహ్నం స్నానాలు చేసేందుకు సముద్రంలో దిగగా, నలుగురు కెరటాలకు కొట్టుకుపోయారు. ముగ్గురు అతి కష్టమ్మీద ఒడ్డుకు చేరగా, ఉపేంద్ర మాత్రం గల్లంతయ్యాడు. విషయాన్ని స్థానికులు మెరైన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సుమారు గంటసేపు ఉపేంద్ర ఆచూకీ లభించకపోవడంతో, మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలించారు. గంట తర్వాత ఉపేంద్ర మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. అప్పటివరకు తమతో కలిసి తిరిగిన ఉపేంద్ర విగతజీవిగా ఒడ్డుకు కొట్టుకురావడంతో విహారయాత్రకు వచ్చిన స్నేహితులు, బంధువులు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయారు. ఉపేంద్ర మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. చేతికి అంది వస్తున్న కుమారుడు ఇక తిరిగి రాడన్న చేదు నిజాన్ని తట్టుకోలేక తల్లిదండ్రులు చలపతిరావు, అప్పలమ్మ గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించింది. ఉపేంద్ర పలాసలో ఐటిఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

ఎచ్చెర్ల : స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజీజ్ శుక్లదాస్, విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి ఆదివారం పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ రోజున ఇవిఎంలను కౌంటింగ్ గదులకు తీసుకువచ్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ్నుంచి పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అంబులెన్స్‌లు నిలుపు స్థలం, వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఫుడ్ స్టాల్స్ తదితరమైనవి ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎపిసి జయప్రకాశ్, డిపిఒ వెంకటేశ్వరరావు, సుడా వైస్ చైర్మన్ చల్లా ఓబులేసు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజీజ్ శుక్లదాస్ సంయుక్త పర్యవేక్షణలో ఆదివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి నియామక ఉత్తర్వులను అందజేస్తామన్నారు. తుది విడత కౌంటింగ్ రోజున ఆయా కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, టెక్కలి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కరమ్, పలాస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్, శ్రీకాకుళం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిహెచ్.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మెమెంటోను స్వీకరిస్తున్న స్నేహల్ ప్రతాప్ భోస్లే

అరసవల్లిని సందర్శించిన కౌంటింగ్ పరిశీలకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం దేశంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఎఎస్ అధికారులు సందర్శించారు. ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులుగా బాధ్యతలు నిర్వర్తించేందుకు వచ్చిన వీరంతా స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి స్నేహల్ ప్రతాప్ భోస్లే, ఎస్.సంగీత, కుల్శ్రీనాథ్‌లు సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ సాంప్రదాయ బద్దంగా ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారికి నిర్వహించిన సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెటి మండపంలో ఆలయ ఇఒ ఎస్. చంద్రశేఖర్ స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. వారికి ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. వైశాఖ మాసం చివరి ఆదివారం కావడంతో ఆదివారం రద్దీ కొనసాగింది. దీంతో ఆలయానికి రూ.12.58 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయానికి వచ్చే యాత్రికుల నుంచి టికెట్ల రూపంలో రూ.8,57,000, విరాళాల రూపంలో రూ.83,044, ప్రసాద విక్రయాల రూపంలో రూ.3,18,855 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ చంద్రశేఖర్ తెలిపారు.


మాట్లాడుతున్న తిరుమలరావు

వ్యాయామంతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేటి తరం పిల్లల్లో వ్యాయామం, శారీరక శ్రమ, ఆలోచన శక్తికి పదును పెట్టేందుకు అవసరమైన శ్రద్ధ లేకపోవడం వలన మానసిక ఉల్లాసానికి దూరమవుతున్నారని, దీనివలన చదువుకునే సమయంలో ఒత్తిడికి గురవుతున్నారని ప్రభుత్వ న్యాయవాది కోత తిరుమలరావు అభిప్రాయ పడ్డారు. గడచిన ఆరు రోజులుగా నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో క్రియేటివ్ చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి వినోద కార్యక్రమాన్ని ఆదివారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై పిల్లలో చురుకుతనం ఉన్నా స్వయంగా ఆలోచించే ప్రయత్నం జరగడం లేదన్నారు. స్కూల్లో వ్యాయామం సరిగా లేక, క్లరికల్లు లేక పుస్తకాలకు పరిమితమవుతున్నారన్నారు. అటువంటి చిన్నారులకు వేసవి వినోదం ద్వారా సృజనాత్మకతను, సొంతంగా ఆలోచించగల మానసిక స్థితిని రూపొందించుకునేందుకు దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోపాలరావు హాజరై పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు.


స్వర్ణ పతకం అందుకుంటున్న రాజారావు

రాజారావుకు స్వర్ణ పతకం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వావిలిపల్లిపేటకు చెందిన స్కూలు అసిస్టెంట్, శ్రీశ్రీ జాతీయ కళావేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వావిలిపల్లి రాజారావుకు ఆదివారం విజయవాడలోని హనుమంతరావు గ్రంథాలయంలో ఘనంగా సత్కరించారు. తెలుగుభాషా, సాహిత్యాలకు విశిష్ట సేవలందించినందుకు విజయవాడలోని తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవాసంస్థ సన్మానించింది. ఈ సందర్భంగా ఆయనకు స్వర్ణ పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేసింది. దుశ్శాలువను కప్పి సన్మానించారు. సంస్థ అధ్యక్షులు డా.యు.వి.రత్నం, గుడ్లవల్లేరు డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డి.ప్రసాద్, సినీ కార్యనిర్వాహక నిర్మాత ఆర్.వి. చలపతిరావు, ఆర్టిస్ట్ బి.నరేష్ తదితరులు రాజారావు మాస్టారును సత్కరించిన వారిలో ఉన్నారు. మాస్టారు ఎందరో మహానుభావులు, మహోన్నత శిఖరాలు, నా దేశం పుస్తకాలను రాశారు. హైదరాబాద్‌లో 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని స్వీయ కవితా పఠనం చేశారు. విజయవాడ, అవనిగడ్డ, అంతర్వేది తదితర చోట్ల జరిగిన సాహితీ సభల్లో పాల్గొన్నారు.

ఐసెట్‌లో 'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల హవా

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర స్థాయి ఐసెట్ పరీక్ష ఫలితాల్లో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 10 లోపు 3 ర్యాంకులు, 100 లోపు 22 ర్యాంకులు, 1000 లోపు 95 ర్యాంకులతో విజయాన్ని అందుకున్నట్లు విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు బి.కార్తీక్, 6వ ర్యాంకు ఎస్.దశరథ రామరెడ్డి, 8వర్యాంకు పి.అనుపమలు దక్కించుకున్నారు. 100 లోపు 22 ర్యాంకులు వచ్చాయన్నారు. ఎల్. యశ్వంత్ సాయి 19 వ ర్యాంకు, కె. నాగదుర్గా ప్రసాద్ 27వ ర్యాంకు, ఎ.తరుణ్ ఆదిత్య శ్రీ వర్ధన్ 28వ ర్యాంకు, బి.శ్రీకాంత్ 33వ ర్యాంకు, కెడియన్ నిఖిత 39వ ర్యాంకు, సి.హెచ్. దేవి శైలజ 43వ ర్యాంకు, కె.శ్రీసాయి వినయ్ 58వ ర్యాంకు, ఎన్.నితిన్ సాగర్ 62వ ర్యాంకు, పి.వి.యల్ దివ్య 63, ఎ.ఐజాక్ బాబు 64, కె.లక్ష్మీప్రసన్న 69, ఎ.మానసప్రియ 71, వి.ధరణి 73వ ర్యాంకు, బి.నాయన 74వ ర్యాంకు, పి.ఎస్.వి అవినాష్ 77, ఎం.ఉదయ్ సాత్విక్ 93, వై సత్య 94వ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.గోపాల్ తదితరులు ర్యాంకులను దక్కించుకున్నారని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ బి.యి.వి.ఎల్ నాయుడు, కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.


చెత్తాచెదారంతో నిండిన వంశధార కాలువ

మురుగు కాదు... వంశధార కాలువ

పలాస: ఆ కాలువ చెత్తా చెదారంతో నిండిపోవడంతో మురికి కాలువ అనుకుంటే పప్పులో కాలేసినట్టే. పలాస సీతమ్మ గుడి ఎదురుగా ఉన్న వంశధార ప్రధాన కాలువ. ప్రతిఏడాది ఈ కాలువ నుంచి పలాస మండలం లొత్తూరు కొండలపై కురిసిన దేశబట్టి, వంశధార వరద నీరు కలిసి పలాస జగన్నాధం సాగర్‌లో కలుస్తుంది. అక్కడ నుంచి పలాస, కాశీబుగ్గ పట్టణ పంట భూములతో పాటు వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరు వరకు వంశధార సరఫరా అవుతుంది. అయితే వంశధార అధికారుల నిర్లక్ష్యానికి వంశధార కాలువ మురికి కాలువలా దర్శనమిస్తుంది. ఇలా అయితే పంట భూములకు సాగునీరు ఎలా సరఫరా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వంశధార అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంను తొలగించి సాగునీరు శివారు భూములకు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఓనిగెడ్డ ఆనకట్ట(రా)!


ఓనిగెడ్డ ఆనకట్ట

- ఏటా అందని సాగునీరు
- నేతల హామీలు నీటిమూటలే
- ఆందోళనలో అన్నదాతలు

అన్నదాతలే దేశానికి వెన్నెముకలని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఆ రైతు సాగుకు అవసరమైన సాగునీరు అందించడంలో అటు పాలకవర్గం ఇటు అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పులు చేసి రాత్రింబవళ్లు ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంటకు అవసరమైన సాగునీరు అందకపోవడంతో నష్టాల ఊబిలో రైతు కూరుకుపోతున్నాడు. అయినప్పటికీ అటు అధికారులు ఇటు ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

ప్రజాశక్తి- బూర్జ

రైతు బాగుంటేనే గ్రామం, రాష్ట్రం తద్వారా దేశం బాగుపడుతుందని ఉపన్యాసాలు గుప్పిస్తున్నారే తప్ప రైతుకు అవసరమైన సాగు నీరు అందించడంలో అధికారులు ప్రభుత్వం విఫలమైందని విమర్శలు వినిపిస్తున్నాయి. శివారు భూముల వరకు సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప అందుకు తగ్గ చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. పాలకొండ మండలం వెలగవాడ పంచాయతీ పరిధిలో ఉన్న విజయ రామపురం గ్రామం వద్ద ఓని గెడ్డ ఉంది. కొండల నుంచి జారు వారే నీటిని సద్వినియోగ పరుచాలని 1957లో అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. తద్వారా పాలకొండ మండలానికి సంబంధించి ఐదు కిలోమీటర్ల దూరం, బూర్జ మండలానికి సంబంధించి మరో 17 కిలోమీటర్ల దూరం మొత్తం 22 కిలోమీటర్ల రాతి కట్టు కాలువను ఏర్పాటు చేశారు. నీరు నిల్వ ఉండేందుకుగాను ఆరెకరాల 50 సెంట్లు భూమిని కేటాయించారు. అలాగే నీటిని నిలువ ఉంచేందుకు షట్టర్లను ఏర్పాటు చేశారు. ఓనిగడ్డ ఆనకట్ట ద్వారా సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో 62 మదుములు, 46 సైఫాన్‌లు ఏర్పాటు చేశారు.


మరమ్మతులకు గురైన షట్టరు

మరమ్మతులు చేపట్టాలి



ఓనిగెడ్డ ఆనకట్టకు మరమ్మత్తులు చేపట్టాలి. ప్రతి ఏడాది పంటలు నష్టపోతున్నాం. సాగునీరు అందించేందుకు అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- ముడిలి పాపారావు,
ఆయకట్టు రైతు, కొత్త లక్కుపురం

ఇంతవరకు బాగానే ఉంది. పాలకొండ మండలం నుంచి బూర్జ మండలంలోని తుడ్డలి, దొంకలపర్త, అప్పలపేట, పెద్దపేట, కొల్లివలసతో పాటు ఉప్పినివలస వరకు సుమారు 20 గ్రామాలకు సంబంధించి సాగునీరు అందించేది. ప్రతి ఏడాది శివారు భూములకు కూడా సాగునీరు అందేదని రైతులు పేర్కొన్నారు. ఇది గతం. ప్రస్తుతం దశాబ్ద కాలంగా ఒక్క చుక్క కూడా సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓనిగెడ్డ ఆనకట్ట ద్వారా తాము ప్రతి ఏడాది పంటలు నష్టపోతూనే ఉన్నామని రైతులు తెలిపారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో పాలకవర్గం ఎంతో ఆర్భాటంగా సాగునీరు విడుదల చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప చుక్క నీరు ఇచ్చిన పాపాన పోలేదని రైతులు వాపోతున్నారు. శివారు భూముల వరకు సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పించి ఆ తర్వాత మొహం చాటేస్తున్నారన్నారు. ఓనిగెడ్డ ఆనకట్టకు సంబంధించి నీరునిల్వ ఉండేందుకు ఏర్పాటు చేసిన పెద్ద షట్టర్లు పూర్తిగా పాడైపోయాయి. రాతికట్టు కాలువ మొత్తం పూర్తిగా శిథిలమైంది. అలాగే మదుములు పాడైపోయాయి. కాలువల్లో పూడికలు కూడా తీయకపోవడంతో పేరుకుపోయాయని, ఇలా ఉంటే తమకు సాగునీరు ఎలా వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ఆనకట్టకు మరమ్మతులు చేపడతాం



ఓనిగెడ్డ ఆనకట్టకు సంబంధించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.ఐదు లక్షలతో షట్టర్లు కొనుగోలు చేయడమైంది. త్వరలోనే వాటిని ఏర్పాటు చేస్తాం. ఓనిగెడ్డ ఆనకట్ట కాలువ ఆధునికీకరణ పనుల కోసం రూ.11 కోట్ల 5 లక్షలు ఎస్టిమేట్‌తో ప్రతి పాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం. ఈ ఏడాది శివారు భూములకు కూడా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడతాం.

- దమలపాటి రవికుమార్, డిఇఇ


పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఓనిగెడ్డ కాలువ


మెళియాపుట్టి : పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి అనురాధ

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వారం రోజుల పాటు చిత్రలేఖనం నేర్పించిన అనంతరం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠ శాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న అలియన్స్ క్లబ్ ప్రతినిధులు

బాధితురాలికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం స్వేచ్ఛ నగరిలో నివాసం ఉంటూ కన్యకా పరమేశ్వరి గుడిలో స్వీపర్‌గా పనిచేస్తున్న సరస్వతి పండిట్ మనవడు సంతోష్ పండిట్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బరంపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంతోష్ పండిట్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అలియన్స్ క్లబ్ సభ్యులు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు. సంస్థ అధ్యక్షులు లోపింటి నరసింహామూర్తి, కార్యదర్శి తిప్పన లక్ష్మణ రెడ్డి, లలితాంబిక, వెంకట రమణ, బాలకృష్ణ, లోహిదాసు, బాలగోపాల్, జయకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలాస: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 ఏడిదిలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు కాశీబుగ్గ కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా తోటి విద్యార్థులు చనిపోయిన వారికి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు రూప్ సుందర్, శంకర్, శేషగిరి, దేవా, ప్రకాష్, మాధవ, మధు మాట్లాడుతూ అప్పటి జ్ఞాపకాలు, మధుర క్షణాలు చిన్ననాటి స్నేహితులం కలిసి నెమరు వేసుకున్నామన్నారు. అనంతరం స్నేహితులు ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. అలాగే ఈశ్వర్ పాత్రో మిమిక్రి అలరించింది. కార్యక్రమంలో శివ, ఈశ్వర్, ఉదయ్, ప్రసాద్, సునీత, చైతన్య, సుజాత ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతిఒక్కరు ఎన్నికల నిబంధనలు ప్రకారం శాంతి భద్రతలకు విఘాతం లేకుండా నడచుకోవాలని ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి బి.విజయకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 14వ వార్డు ఐజె నాయుడు కాలనీ, 9వవార్డు మెట్టక్కివలసలో ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఎపిఎస్‌పి బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు వస్తుంటాయి, వెళ్తుంటాయని జీవితాంతం కలిసిమెలిసి ఉండవలసిన ప్రజలు చిన్నపాటి మనస్పర్ధలతో వివాదాలు కొనితెచ్చుకొని జీవితాలను, విలువైన కాలాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ముఖ్యంగా ఎన్నికల సంఘ నిబంధనలు మేరకు ఫలితాల రోజున బాణాసంచా పేలుళ్ల, ర్యాలీలు, ఊరేగింపులకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. వచ్చే నెల 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఇద్దరు ముగ్గురు గుమిగూడి ఉండరాదన్నారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిపై పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అలాగే సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో డిఎస్‌పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్ఐ బి.నిహార్, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి విజయ్ కుమార్

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి


మాట్లాడుతున్న శివ

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో సాగు చేస్తున్న జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు బొమ్మాలి శివ డిమాండ్ చేశారు. మండలం నీలావతిలో ఉద్దాన విద్యా అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి జీడి రైతులను ఆదుకోవాలంటూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర రైతులకు లభించే విధంగా నూతనంగా ఏర్పడే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షా భావ పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది పంట దిగుబడి 20 శాతానికి పడిపోవడంతో ఉద్దానం ప్రాంతంలో జీడి ప్రధాన జీవనాధార పంటగా ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలాసలో జీడి కార్పొరేషన్, జీడి బోర్డును ఏర్పాటు చేసి శాశ్వత ప్రాతిపదికన రైతులకు లాభాలు చేకూర్చే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో యువివి గౌరవ అధ్యక్షులు కె.ప్రకాశరావు, బొడ్డు చిన్నారావు, తెప్పల వాసు, సీతారామయ్య, కృష్ణారావు, కుత్తుం సుధాకర్, కుత్తుం వినోద్, ఎంపల్ల కామేశ్వరరావు, ఎస్.మాధవరావు, పి. మాధవరావు, కామేశ్వరరావు, లింగమూర్తి పాల్గొన్నారు.

హైబ్రిడ్ లెర్నింగ్ సెంటర్‌గా 'జ్ఞానభారతి' ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

భారత ప్రభుత్వం విద్యా మంత్రిత్వ శాఖ వినూత్న విధానం నెప్ 2020 అమలు చేయడానికి నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే జిల్లాలో ఒక సిబిఎస్ఇ పాఠశాలకు అవకాశం రావడం, ఇచ్ఛాపురంలో జ్ఞానభారతి విద్యా సంస్థలు ఎంపికవ్వడం జరిగిందని విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఎస్ఇ గుర్తింపు పొందిన పాఠశాలలను మైక్రోసాఫ్ట్ కంపెనీ సిబిఎస్ఇతో కలిపి హైబ్రిడ్ లెర్నింగ్ సెంటర్ జిల్లాకు ఒక స్కూల్‌ను గుర్తించి హైబ్రిడ్ లెర్నింగ్ సెంటర్, స్కిల్ స్కూల్‌గా గుర్తించి సంస్థల ద్వారా శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో గత 40 ఏళ్లుగా సిబిఎస్ఇ గుర్తింపు పొందిన జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సీనియర్ సెకండరీ ఇచ్ఛాపురంలో భాగస్వామ్యం కావడం చాలా ఆనందదాయకమన్నారు. ఇందుకు సంబంధించి బెంగుళూరులో ఏప్రిల్ 18 నుంచి మే 1 వరకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందినట్టు తెలిపారు. ఆదివారం విద్యాసంస్థలో తమ సిబ్బందికి శిక్షణ అందించారు. 2024-25లో విద్యాసంస్థలో నూతన విద్య, సాంకేతిక విద్యతో పాటు నూతన సౌకర్యంతో విద్యార్థులకు బోధన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండా, రషీద సుల్తాన్, పరిపాలన సిబ్బంది, ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు శిక్షణా ఇస్తున్న జోహార్‌ఖాన్


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఆదినాయుడు

బాధితునికి సహాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని నందవ గ్రామంలో ఇటీవల రేకుల ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన సవర పెద్ద శంబురు కుటుంబానికి మండల వైస్ ఎంపిపి ఎస్ ఆది నాయుడు, స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు బియ్యం కూరగాయలు కొంత ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు సవర వెంకన్న, వీరన్న, విశాఖరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కవిటి

తమ సామాజిక తరగతి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్ కోసం తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 158వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జాతికి గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బెంతులకు గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ప్రజలకు తప్పని విద్యుత్ అగచాట్లు

శ్రీకాకుళం అర్బన్: నగరంలో గుజరాతీ పేట ప్రాంత విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌శాఖ సిబ్బంది, అధికారులు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలు ఈ ప్రాంత ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా ఇదే విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్ప కనీసం స్పందన కూడా రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. గుజరాతిపేట, తోటవీధి ప్రాంతాలకు నలువైపులా విద్యుత్ సరఫరా ఉంటున్నప్పటికీ కేవలం మధ్యలో ఉన్న కొంత భాగం చిలకపాలెం సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడమే ఈ సాంకేతిక సమస్యలకు, కోతలకు ప్రధాన కారణం. ఇదే లైన్ ద్వారా తోటపాలెం, పొన్నాడ తదితర గ్రామీణ ప్రాంతాలకు సైతం సరఫరా జరుగుతుండడంతో విద్యుత్ లోడు అధికంగా పెరిగి గ్రామీణ ఫీడర్ తరహాలోనే తోటవీధి, గుజరాతిపేట ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ కోతలు ఉంటున్నాయి. గతంలో టౌన్ ఫీడర్ ద్వారా ఈ ప్రాంతానికి విద్యుత్ సరఫరా జరిగేది. అనంతరం విద్యుత్ లైన్ మరమ్మతు పేరుతో రూరల్ ఫీడర్ పరిధిలోకి ఈ ప్రాంతాన్ని చేర్చడంతో ఇక్కడ ప్రజలకు విద్యుత్ విభాగం ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తుందని వినియోగదారులు తీవ్రంగా మండి పడుతున్నారు. విద్యుత్ బిల్లులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధలో కనీసం ఒక శాతం వినియోగదారుల సమస్యల పట్ల చూపించినట్లయితే ఈ సమస్య ఎప్పుడో పరిష్కారం అయ్యేదని, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంత ప్రజలకు విద్యుత్ కష్టాలు నేటికీ కొనసాగుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి 12.15 గంటలకు విద్యుత్ నిలిపివేసి ఉదయం 9.15 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా జరుగుతున్న పిఎన్ కాలనీ సహా నగరం మొత్తం రాత్రంతా విద్యుత్ సరఫరా జరిగినప్పటికీ నగరం నడిబొడ్డున ఉన్న తోటవీధి, గుజరాతి పేట ప్రాంతాలకు మాత్రం విద్యుత్ సరఫరా లేదు.



నిజ నిర్ధారణ బృందాన్ని అడ్డుకోవడం అప్రజాస్వామికం

ప్రజాశక్తి- పలాస

దండ కారణ్యంలో ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం 'కగార్' ఆపరేషన్ పేరిట యుద్ధాన్ని ప్రకటించటం తమ పౌరులను తనే చంపటం అవుతుందని కమ్యూనిస్టు పార్టీలో ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆదివారం మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ మాట్లాడుతూ గత రెండు నెలల కాలంలో సుమారు 120 మంది ఆదివాసీలను, మావోయిస్టులను భారత సైన్యం కాల్చి చంపిందని ఆరోపించారు. దీనికి బిజెపి ప్రభుత్వం నాయకత్వం వహిస్తూ ఆదివాసీలపై యుద్ధాలు ప్రకటించిందని దీనిని ఖండిస్తూ దండకారణంలో ఏం జరుగుతుందని దేశంలో ఉన్న పౌర ప్రజాస్వామ్యవాదులు, హక్కుల సంఘాలు కలిసి నిజం నిర్ధారణ కోసం వెళ్తే అక్కడ సైనికులు వెళ్లకుండా అడ్డుకొని బెదిరించటం అప్రజాస్వామిక చర్యగా భావిస్తున్నామన్నారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షులు తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, అక్కడ శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీ పోరాటాల్లో వేలాది మంది ఆదివాసులను పాలకవర్గాలు చంపుతూ వస్తున్నాయని, వెంటనే 'కగార' ఆపరేషన్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ మాట్లాడుతూ దండకారణ్యంలో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని, దేశంలో అన్ని శక్తులు ఏకం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో పోతనపల్లి కామేశ్వరరావు, మద్దిల రామారావు, దుష్యంత్, ఢిల్లీరావు, వైకుంఠరావు, పోలారావు, జగదీష్, పోతనపల్లి అప్పారావు, రాపాక మాధవరావు, మల్లేశ్వరరావు, బర్ల గోపి, అప్పయ్య, పున్నయ్య, కామేశ్వరరావులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు


పిచ్చిమొక్కల మధ్య అక్షర క్రాంతి భవనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ప్రజా అవసరాల కోసం నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు వినియోగం లేక నిరుపయోగంగా మారాయి. దీంతో ఆ భవనాలు పిచ్చిమొక్కల మధ్య దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్ కార్యాలయం వెనుక పాత హౌసింగ్ భవనం వినియోగం లేక శిథిలావస్థ స్థితికి చేరుకుంది. అలాగే ఎఐ కార్యాలయం వద్ద అక్షర క్రాంతి భవనం వినియోగం లేక నిరుపయోగంగా ఉంది. గతంలో ఇందులో మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సామగ్రిని ఉంచేవారు. ప్రస్తుతం ఇది వినియోగం లేక నిరుపయోగంగా ఉంది. అలాగే పర్లాకిమిడి రోడ్డులో ఏర్పాటైన ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్‌ను గిరిజన నిరుద్యోగులకు ఉపాధి చేకూరేలా వీటిని ఏర్పాటు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఐదు గదులు ఉండగా, ప్రస్తుతం రెండు గదులను మాత్రమే వినియోగిస్తూ... మిగిలిన మూడు గదులను నిరుపయోగంగా ఉన్నాయి. మెళియాపుట్టి వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు వినియోగం లేక నిరుపయోగంగా ఉంది. మండలంలో దాదాపు రూ.50 లక్షల మేర ప్రజాధనం వృథాగా మారింది. అధికారులు దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.